క్లుప్తంగా

నియామకం



ఎల్కతుర్తి : ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా భీమదేవరపల్లి మండలంలోని మాణిక్యాపూర్ గ్రామానికి చెందిన గడ్డం వెంకటేశ్‌ను ఎన్నుకున్నట్లు జాతీయ అధ్యక్షుడు బైరి వెంకటేశం తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన నియామక ఉత్తర్వులు వెంకటేశ్‌కు అందజేశారు. అనంతరం వెంకటేశ్ మాట్లాడారు. త్వరలో జిల్లాలోని అన్ని మండలాల్లో నూతన కమిటీలను వేయనున్నట్లు తెలిపారు.

సన్మానం



శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ కోగిల సదానందం–అగ్నేష దంపతుల కూతురు నందిని స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో సర్పంచ్ అబ్బు ప్రకాశ్‌రెడ్డి ఆదివారం పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడారు. నందిని ఎల్‌ఎల్‌బీ పూర్తి చేసుకుందన్నారు. త్వరలో ఆమె జిల్లా న్యాయస్థానంలో న్యాయవాదిగా విధుల్లో చేరనుందని చెప్పారు. ఈ సందర్భంగా ఆమెను సన్మానించినట్టు తెలిపారు. నందినిని స్ఫూర్తిగా తీసుకుని గ్రామ యువత విద్యారంగంలో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కోగిల అర్జున్, అర్షం రంజిత్, రమేశ్, సంపత్, మహేందర్, భిక్షపతి తదితరుల

రెడ్డి సంఘం కార్యవర్గం ఎన్నిక



ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలంలో రెడ్డి సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా పెంటమూర్తి దివాకర్‌రెడ్డి, అధ్యక్షుడిగా కొడకండ్ల సుదర్శన్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా ఎర్రబెల్లి రమణారెడ్డి, రామచంద్రారెడ్డి, పెంటమూర్తి రణధీర్‌రెడ్డి, చెప్యాల తిరుపతిరెడ్డి, జమ్ముల భీమ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కొట్టె కృష్ణారెడ్డి, కోశాధికారిగా మార్పాటి శ్రీనివాస్‌రెడ్డి, సహాయ కార్యదర్శులుగా కాశిరెడ్డి ఆదిరెడ్డి, మారుపాటి గురువారెడ్డి, గుడెల్లి తిరుమల్‌రెడ్డి, జిమ్మల మల్లారెడ్డి, గోపాల్‌రెడ్డి, ఏనుగుల ఈశ్వర్‌రెడ్డి, పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎనుగు సుధాకర్‌రెడ్డి, కేతిరి రమణారెడ్డి, అనుమాన్ల నాగిరెడ్డి. కార్యవర్గ సభ్యులుగా నరాల తిరుపతిరెడ్డి, వీరారెడ్డి, కొండాల్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, లక్కిరెడ్డి నర్సింహారెడ్డి. సలహాదారులుగా లక్ష్మారెడ్డి, వెంకట్‌రెడ్డి, రాజిరెడ్డి, మారుపాటి మహేందర్‌రెడ్డి ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం చేసింది. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపు జయపాల్‌రెడ్డి, జిల్లా నాయకులు కిషన్‌రెడ్డి, మట్ట రాజిరెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



ఎల్కతుర్తి : మండలం ఇందిరానగర్ సమీపంలోని మోడల్ స్కూల్ సమీపంలో ముల్కనూర్ రహదారిపై ఆదివారం రాత్రి 9 గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందారు. సైకిల్ మీద వెళ్తున్న వ్యక్తిని కారు ఢీకొన్నట్టు తెలుస్తోంది. పోలీసులు విచారణ చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

విద్యుదాఘాతంతో గేదె..



నడికూడ : విద్యుదాఘాతంతో గేదె మృతి చెందిన ఘటన మండలంలోని కంఠాత్మకూర్ గ్రామంలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పరమేశ్వర్ గేదెలను రోజు మాదిరిగా గ్రామంలోని మన్నెపు కుంటకు మేతకు తీసుకుగా గేదెలు పశుగ్రాసం మేస్తున్న క్రమంలో కిందికి వేలాడుతున్న విద్యుత్ వైర్లు తగిలాయి. ఈ క్రమంలో ఒక గేదె అక్కడికక్కడే మృతి చెందగా మరో గేదె తీవ్ర గాయాల పాలైంది.

బైక్ చోరీ

ఖిలా వరంగల్: వరంగల్ శంభునిపేట విశ్వనాథకాలనీలో నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. బాధితుడి కథనం ప్రకారం విశ్వనాథకాలనీకి చెందిన అలకుంట అనిల్ తన బైక్‌ను ఈనెల 11న అదేవీధిలో పార్క్ చేసి ఇంటికి వెళ్లాడు. మరుసటి రోజు ఉదయం చూసేసరికి బైక్ కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు ఆదివారం తెలిపారు.

తెలంగాణ పథకాలు దేశానికే ఆదర్శం

● ఎమ్మెల్యేలు తాటికొండ, అరూరి

ధర్మసాగర్ : బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని స్టేషన్ ఘన్‌పూర్, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు డాక్టర్ తాటికొండ రాజయ్య, అరూరి రమేశ్ తెలిపారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని రిజర్వాయర్ సమీపంలోని మిషన్ భగీరథ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ వద్ద మంచినీళ్ల పండుగను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు అతిథులుగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలోని మొత్తం ఆవాసాలకు స్వచ్ఛమైన తాగునీరు అందిస్తున్న ఏకైక రాష్ట్రంగా తెలంగాణ గుర్తింపు పొందిందని చెప్పారు. ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఉచితంగా ఇంటింటికీ నల్లాల ద్వారా తాగునీరు అందిస్తోందని తెలిపారు. ప్రజల తాగునీటి కష్టాలను తీర్చడానికి సీఎం కేసీఆర్ మిషన్ భగీరథ పథకాన్ని రూ.43 వేల కోట్ల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీ పసునూరి దయాకర్, జెడ్పీ చైర్మన్ సుధీర్ కుమార్, వైస్ చైర్మన్ శ్రీరాములు, డీఆర్‌డీఓ శ్రీనివాస్ కుమార్, మిషన్ భగీరథ ఎస్‌ఈ శ్రీనివాస్, ఈఈ రామాంజనేయులు, డీఈలు సునీత, జీవన్, ఏఈ మహేశ్, ఎంపీడీఓ గార్లపాటి జవహర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ధర్మసాగర్ : ప్లాంట్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యేలు రాజయ్య, రమేశ్, ఎంపీ దయాకర్, తదితరులు

అపర భగీరథుడు సీఎం కేసీఆర్

దామెర : సీఎం కేసీఆర్‌ను అపర భగీరథుడుగా పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అభివర్ణించారు. మండలంలోని సింగరాజుపల్లి సమీపంలోని మిషన్ భగీరథ వాటర్ గ్రిడ్‌లో నియోజనవర్గ స్థాయి నీళ్ల పండుగను నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే ధర్మారెడ్డి మాట్లాడారు. సమైఖ్య రాష్ట్రంలో మంచినీటి కోసం మహిళలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. ఈ క్రమంలోనే సీఎం కేసీఆర్ మిషన్ భగీరథ పథకాన్ని చేపట్టి సమస్యను శాశ్వతంగా పరిష్కరించారని తెలిపారు. నియోజకవర్గంలో 164 గ్రామాలకు, పరకాల మున్సిపాలిటీకి సింగరాజుపల్లి వాటర్ గ్రిడ్ నుంచి నీటిని సరఫరా చేస్తున్నట్టు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు శ్రీనివాస్ మాట్లాడుతూ మిషన్ భగీరథ పథకం దేశానికే ఆదర్శమన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ వెంకటేశ్వర్‌రావు, మిషన్ భగీరథ ఈఈ మణిక్యరావు, డీఈలు శ్రీనివాస్, చంద్రునాయక్, ఏఈ సతీశ్‌కుమార్, ఎంపీపీ కాగితాల శంకర్, కళావతి, జెడ్పీటీసీలు పోలీసు ధర్మారావు, గరిగె కల్పన కృష్ణమూర్తి, అనసూయ, వైస్ ఎంపీపీ జాకిర్ అలీ, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గండు రాము, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు గట్ల విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఐనవోలు : మండలంలోని అన్ని గ్రామాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు ర్యాలీలు నిర్వహించారు. గ్రామ సభలు ఏర్పాటు చేసి తాగునీటి సరఫరాపై వివరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మార్నేని మధుమతి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటరమణ, ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



దామెర : మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మారెడ్డి



ఆత్మకూరు : మండలంలో ర్యాలీ

శాయంపేట : మండల కేంద్రంలో సర్పంచ్ కందగట్ల రవి ఆధ్వర్యంలో మంచినీళ్ల పండుగ నిర్వహించగా ముఖ్యఅతిథిగా ఎంపీపీ తిరుపతిరెడ్డి పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ డీఈ చంద్రునాయక్, మండల స్పెషల్ ఆఫీసర్ హరిప్రసాద్, ఎంపీడీఓ ఆమంచ కృష్ణమూర్తి, పంచాయతీ కార్యదర్శి రత్నాకర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మారెపల్లి నందం, ఉపసర్పంచ్ దైనంపల్లి సుమన్, తదితరులు పాల్గొన్నారు.



ఐనవోలు : మాట్లాడుతున్న ఎంపీపీ మధుమతి



ఎల్కతుర్తి : మాట్లాడుతున్న ఎంపీపీ స్వప్న

పత్తిపాకలో..

మండలంలోని పత్తిపాకలో సర్పంచ్ చిట్టిరెడ్డి రాజిరెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ కందగట్ల ప్రకాశ్, ఉపసర్పంచ్ పోతుగంటి సరోజన మల్లయ్య పాల్గొన్నారు.

ఆత్మకూరు : మండలంలోని ఆత్మకూరు, ఇతర గ్రామాల్లో మంచినీటి పండుగ ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి యాదగిరి, ఉపసర్పంచ్ వంగాల స్వాతి భగవాన్‌రెడ్డి, ఆశకార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాల్లో ర్యాలీలు నిర్వహించారు. వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేశారు. అనంతరం సమావేశాల్లో ఎంపీపీలు మేకల స్వప్న, జక్కుల సునీత మాట్లాడారు. సమావేశాల్లో జెడ్పీటీసీ రవీందర్, ఎంపీడీఓలు తూర్పాటి సునీత, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



శాయంపేట : మాట్లాడుతున్న ఎంపీపీ తిరుపతిరెడ్డి



కమలాపూర్‌లో..

కమలాపూర్ : తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోని మిషన్ భగీరథ మంచినీటి ట్యాంక్ నుంచి రైతు వేదిక వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం డీఈ శ్వేత మాట్లాడారు. మిషన్ భగీరథ నీటిలో పోషకాలు, మినరల్స్ ఉంటాయని తెలిపారు. ఎంపీపీ రాణి శ్రీకాంత్ మాట్లాడుతూ తాగునీటి సమస్య పరిష్కారానికే మిషన్ భగీరథ పథకాన్ని ప్రవేశపెట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కల్యాణి లక్ష్మణ్‌రావు, సర్పంచ్ విజయ తిరుపతిరెడ్డి, ఎంపీఓ విమల, ఈఓ రాజారాం, ల్యాబ్ టెక్నీషియన్ దివ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యం



మాట్లాడుతున్న చుక్కయ్య

● రైతు సంఘం జిల్లా కార్యదర్శి చుక్కయ్య

ఐనవోలు : ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా పోరుయాత్ర చేపట్టినట్టు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.చుక్కయ్య తెలిపారు. మండల కేంద్రంలో కేజీకేఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు బూర సుధాకర్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన రైతు సంఘం, వృత్తి సంఘాలు, డీవైఎఫ్ఐ, కేవీపీఎస్, సీఐటీయూ ఉమ్మడి సమావేశానికి చుక్కయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈనెల 18 నుంచి 27 వరకు ప్రజాసంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో పేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలని, పేదల గుడిసెలకు పట్టాలివ్వాలని, ఇతర డిమాండ్ల సాధన కోసం బస్సు యాత్ర కొనసాగుతుందని తెలిపారు. బస్సు యాత్ర ఈనెల 21న హనుమకొండకు చేరుకుంటుందని చెప్పారు. హనుమకొండలో తలపెట్టిన బహిరంగ సభకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసపూరితంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. వడగండ్ల వానకు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేల పరిహారం ఇప్పటికీ ఇవ్వలేదని చెప్పారు. గొర్ల పంపిణీని విస్మరించారని తెలిపారు. ఈనెల 23న తహసీల్ కార్యాలయాల ఎదుట, జూలై 3న కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్టు వివరించారు. సమావేశంలో నాయకులు మడిగె నాగరాజు, మేకిరి మోహన్‌రావు, ధీకొండ ఉప్పలయ్య, శంకర్‌రెడ్డి, రవీందర్, రాయపురం కొమురయ్య, పోచమ్మ, సరోజన, రాంకుమార్, చేరాలు, చినరాజు, కుమారస్వామి, సలీం రాజు పాల్గొన్నారు.

ఆలయంలో వైభవంగా చండీ హోమం



ధర్మసాగర్ : మండలంలోని క్యాతంపల్లి గ్రామ శివారులోని ఓషధీశ్వర మానసా దేవి సహిత నవనాగ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో భాను అమావాస్య సందర్భంగా ఆదివారం రుద్ర సహిత చండీ హోమం వైభవంగా నిర్వహించారు. హనుమకొండకు చెందిన శరత్ మాక్సి విజన్ సూపర్ స్పెషాలిటీ కంటి ఆస్పత్రి నిర్వాహకులు ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. అనంతరం మహా అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ పవన్ శర్మ మాట్లాడారు. సర్ప దోష నివారణకు ప్రత్యేక ఆలయం తెలిపారు. ఆలయంలో ప్రతి అశ్లేష నక్షత్రంలో అశ్లేష బలి అమావాస్య రోజున చండీ హోమం, ప్రతి మంగళవారం ఉదయం 6 గంటలకు నవనాగ సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి విశేష అభిషేకం చేయనున్నట్టు వివరించారు. ప్రతి బుధవారం బ్రహ్మశ్రీ రఘు జ్యోతిష్యం చెబుతారని తెలిపారు. ఈనెల 22న సర్ప దోషాలకు ప్రత్యేక పరిహారం అశ్లేష బలి కార్యక్రమం ఉంటుందని చెప్పారు. పాల్గొనే ఆసక్తి కలిగిన ప్రజలు సెల్ నంబర్ 9908998839, 9848371947ల్లో సంప్రదించి గోత్రనామాలు నమోదు చేయించుకోవాలని కోరారు.

అనుమతి లేకుండానే మట్టి తరలింపు

పరకాల : ప్రభుత్వ అనుమతి లేకుండానే పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డికి చెందిన కంపెనీ వాహనాల్లో ఈనెల 13న అర్ధరాత్రి చెరువు మట్టిని అక్రమంగా తరలించారని బీజేపీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే ధర్మారెడ్డిని అవినీతిని బీజేపీ నాయకులు ప్రశ్నిస్తే అభివృద్ధికి అడ్డుపడుతున్నట్టు ఆరోపిస్తున్నారని మండిపడ్డారు. పట్టణంలోని ఆ పార్టీ నియోజవర్గ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విజయ్‌చందర్‌రెడ్డి మాట్లాడారు. ప్రభుత్వ అనుమతి తీసుకున్న తర్వాతే మట్టి తరలించినట్టు బీఆర్‌ఎస్ నాయకులు అబద్ధాలు ప్రచారం చేశారని తెలిపారు. 13న అర్ధరాత్రి బీజేపీ శ్రేణులు అడ్డుకోగా అదే రోజుతో మున్సిపల్ కమిషనర్, ఐబీ అధికారులు దరఖాస్తు చేయగా 14న అనుమతి లభించినట్లు తమ వద్ద ఆధారాలు ఉన్నాయని చెప్పారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే మట్టిని తరలించాలని నిబంధన ఉన్నా అర్ధరాత్రి ఎందుకు తరలించారని ప్రశ్నించారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని అనేక గ్రామాల చెరువుల నుంచి మట్టిని సీఐపీపీఎల్ వాహనాలతో తరలిస్తున్నట్టు తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలను అడ్డుకుంటామని స్పష్టం చేశారు. దామెర చెరువు మట్టిని తరలించిన వాహనాలను అధికారులు తక్షణమే సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్పీ.జయంత్‌లాల్ మాట్లాడుతూ దామెర చెరువులో అర్ధరాత్రి చెరువు మట్టి తరలింపును అడ్డుకోవాల్సిన అధికారులు అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరించారని ఆరోపించారు. సీనియర్ నాయకుడు దుబాసి వెంకటస్వామి మాట్లాడుతూ చెరువు మట్టి తరలింపును ప్రశ్నించినందుకు మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతిపై మాటల దాడికి తెగబడుతున్నారని మండిపడ్డారు. నోటిదురుసు మానుకోకపోతే గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. సమావేశంలో పార్టీ పట్టణ కమిటీ అధ్యక్షుడు మార్త భిక్షపతి, నాయకులు సంఘం పురుషోత్తం, పాలకుర్తి తిరుపతి, ఆకుల రాంబాబు, మంతెన సంతోష్, మారేడుగొండ భాస్కరాచారి, వెనిశెట్టి రాజేశ్, దార్న నారాయణ దాసు, బండారి కృష్ణ, పున్న అశోక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విజయ్‌చందర్‌రెడ్డి

పూర్వవిద్యార్థుల సమ్మేళనం



శాయంపేట : పూర్వ ఉపాధ్యాయులు, విద్యార్థులు

శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాకలోని జెడ్పీ హైస్కూల్‌లో 1995–96 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒకరునొకరు ఆత్మీయంగా పలకరించుకుని ఆనందంగా గడిపారు. అనంతరం నాటి గురువులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు మాచర్ల మంగమ్మ, వావిలాల వేణుగోపాల ప్రసాద్, పూర్వవిద్యార్థులు అన్న మహేందర్, కోగిల భిక్షపతి, ఏదుల మనోహర్, కోగిల చంద్రమౌళి, పైండ్ల శంకర్, శ్రీనివాస్, రఫీ, సురేందర్, చంద్రమౌళి, లక్ష్మిపతి, రాజు, శోభారాణి, సరళ, రమ, సంజీవరావు పాల్గొన్నారు.



ఆత్మకూరులో..

ఆత్మకూరు : మండలంలోని నీరుకుళ్ల గ్రామంలోని జెడ్పీ సెకండరీ స్కూల్‌లో 1994–95 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వవిద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. బాల్యస్మృతులను గుర్తు చేసుకుని ఆనందడోలికల్లో తేలియాడారు. అప్పటి ఉపాధ్యాయులైన సారయ్య, మనోహర్, ఐలయ్యలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ జయరాజ్, మేడ ప్రవీణ్‌కుమార్, బత్తుల రమేశ్, కందగట్ల రాము, రహీమ్ పాషా, దయ్యాల భరత్, రమణారెడ్డి, రాము, నవీన్ కుమార్, కృష్ణం రాజు, సంజీవ్, శ్రీలత, సుజాత, ధనలక్ష్మి, రజిత తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ అమరుల కుటుంబాలకు అన్యాయం

ఆత్మకూరు : సీఎం కేసీఆర్ తెలంగాణ అమరుల కుటుంబాలకు తీరని అన్యాయం చేశారని కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పరికిరాల వాసు విమర్శించారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల కుటుంబాలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం విస్మరించిందని తెలిపారు. దశాబ్ది ఉత్సవాల్లో అమరుల కుటుంబాలను విస్మరించడం తగదన్నారు. తెలంగాణాను ఇచ్చిన కాంగ్రెస్‌ను కేటీఆర్ విమర్శించడం దుర్మార్గమని తెలిపారు. రానున్న రోజుల్లో ప్రజలు బీఆర్‌ఎస్‌కు బుద్ధి చెబుతారని హెచ్చరించారు. సమావేశంలో ఆ పార్టీ జిల్లా నాయకుడు అలువాల రవి, మత్స్య సెల్ చైర్మన్ బయ్య తిరుపతి, సొసైటీ డైరెక్టర్ రేవూరి జయపాల్‌రెడ్డి, యూత్ మండల ప్రధాన కార్యదర్శి తనుగుల సందీప్, మండల ప్రధాన కార్యదర్శి వెల్దె వెంకటేశ్వర్లు, ఓబీసీ సెల్ కోఆర్డినేటర్ చిమ్మని దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

విరాళం

కరీమాబాద్: నగరంలోని నానామీయతోటలో పోచమ్మ గుడి నిర్మాణానికి గడ్డం యుగంధర్ రూ.11 వేలు విరాళం అభివృద్ధి కమిటీ సభ్యులకు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో వాసూరి శ్రీనివాస్, శ్రీపతికుమార్, విజయ, మల్లయ్యగౌడ్, శ్రీనివాస్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

పేదలను ఆదుకోవడమే ప్రభుత్వ ధ్యేయం

● పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

ఆత్మకూరు : పేదలను ఆదుకోవడమే బీఆర్‌ఎస్ ప్రభుత్వ ధ్యేయమని ఏమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తెలిపారు. పరకాల, ఆత్మకూరు, దామెర, నడికూడ మండలాలకు చెందిన 108 మందికి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను హనుమకొండలోని తన నివాసంలో ఆయన ఆదివారం పంపిణీ చేసి మాట్లాడారు. ప్రభుత్వం పేదలకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తోందని తెలిపారు. ఎవరైనా పేదలు అత్యవసర పరిస్థితుల్లో కార్పొరేట్, ప్రైవేట్ ఆస్పత్రుల్లో చేరి వైద్యం పొందితే సీఎంఆర్‌ఎఫ్ ద్వారా ఆర్థికసాయం అందించి ఆదుకుంటున్నట్టు చెప్పారు. పరకాల, ఆత్మకూరు, దామెర, నడికుడ మండలాల్లోని 108 మంది పేదలకు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా తాజాగా రూ.34.49 లక్షలు మంజూరు చేయించి చెక్కులు పంపిణీ చేసినట్టు తెలిపారు. స్వరాష్ట్ర ఏర్పాటుకు ముందుకు సీఎంఆర్‌ఎఫ్ అంటే ప్రజల్లో అవగాహన ఉండేది కాదన్నారు. తెలంగాణ ఏర్పడ్డాక అన్ని వర్గాల పేదల సంక్షేమానికి సీఎం కేసీఆర్ ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. బీఆర్‌ఎస్ హయాంలో జరుగుతున్న అభివృద్ధిని ఓర్వలేక ప్రతిపక్షాలు పనికి మాలిన విమర్శలు చేస్తున్నాయని మండిపడ్డారు. కార్యక్రమంలో ఆత్మకూరు, దామెర ఎంపీపీలు మార్క సుమలత, కాగితాల శంకర్, జెడ్పీటీసీలు కక్కెర్ల రాధిక రాజు, కల్పన, బీఆర్‌ఎస్ నాయకులు కేశవరెడ్డి, వంగాల భగవాన్‌రెడ్డి, పాపని రవీందర్, తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ధర్మారెడ్డి

పద్మశాలీ సంఘం కార్యవర్గం ఎన్నిక

హసన్‌పర్తి: పద్మశాలీ సేవా సంఘం హసన్‌పర్తి శాఖ ఎన్నిక ఫలితాల ఉత్కంఠకు తెరపడింది. చివరికి టాస్ ద్వారా అధ్యక్షుడిని ఎన్నుకున్నారు. పక్షం రోజుల క్రితం పద్మశాలీ సేవా సంఘం ఎన్నికలు జరిగాయి. అధ్యక్షులుగా పోటీ చేసిన గూడురు లక్ష్మీ నారాయణ, కేదాసి రాకేశ్‌కు సమానంగా (223 ఓట్లు) ఓట్లు పోలయ్యాయి. ఈక్రమంలో ఇరువురు కూడా టాస్‌తో అధ్యక్షుడి ఎన్నికకు నిరాకరించారు. స్థానిక పద్మశాలి సేవా సంఘం భవనంలో కుల పెద్దలు ఆదివారం సమావేశమయ్యారు. చివరికి టాస్‌తో ఎన్నుకోవాలని తీర్మానించారు. ఈమేరకు టాస్ వేయగా, రాకేష్ గెలుపొందినట్లు ప్రకటించారు. ఉపాధ్యక్షుడిగా తలకొక్కుల సుభాష్, ప్రధాన కార్యదర్శిగా గడ్డం వెంకటేశ్వర్లు, కోశాధికారిగా మాటేటి దీప్‌రాజ్, కమిటీ సభ్యులుగా చెన్నూరి కుమారస్వామి, మాటేటి కుమారస్వామి, చెన్నూరి రవీందర్, మోత్కూరి శివకుమార్, దాసరి శ్రీనివాస్, కనుకుంట్ల రాజు, పోరండ్ల సారంగపాణి ఎన్నికైనట్లు ఎన్నికల ఇన్‌చార్జ్ మాటేటి భాస్కర్ ప్రకటించారు. కార్యక్రమంలో కులపెద్దలు అనుమాండ్ల విద్యాసాగర్, ధీకొండ భిక్షపతి, సట్యూరి సంతోష్, నల్లా సత్యనారాయణ, చెన్నూరి కిరణ్, మాటేటి రవీందర్, కనుకుంట్ల సతీష్ తదితరులు పాల్గొన్నారు.



రాకేశ్, అధ్యక్షుడు

ఉద్యమ ఫలితంగానే బీఐఎస్ హాల్ మార్క్

ఖిలా వరంగల్: సీసీఐ దీర్ఘకాల ఉద్యమ ఫలితంగానే బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్స్ (బీఐఎస్) హాల్ మార్క్‌ను కేంద్ర ప్రభుత్వ వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రవేశ పెట్టిందని కన్జ్యూమర్ కాన్ఫిడరేషన్ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలిచెర్ల సుదర్శన్ అన్నారు. జూన్ 15నుంచి ప్రతి ఆభరణంపై హాల్‌మార్క్, హెచ్‌యూఐడీ నంబర్‌ను తప్పనిసరిగా ముద్రించాలని కేంద్రం ఆదేశాలు జారీ చేసిందని వివరించారు. దీనిపై వినియోగదారులను చైతన్యం చేయాలని వినియోగదారుల ప్రతినిధులకు సూచించారు. ఈమేరకు వరంగల్ శివనగర్‌లోని జిల్లా వినియోగదారుల సమాఖ్య కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బంగారు ఆభరణాల కొనుగోలులో వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సీసీఐ లీగల్ అడ్వైజర్ మెంబర్ రంగరాజు ఆనందరావు మాట్లాడుతూ వినియోగదారులు పరీక్షించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సీసీఐ లీగల్ అడ్వైజర్ బండి అనిల్‌కుమార్, సలహాదారుడు డాక్టర్ వీరస్వామి, అల్లాది వీరభద్రయ్య, సీసీఐ ప్రతినిధులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పాలన అస్తవ్యస్తం

ఎంజీఎం: రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పాలన అస్తవ్యస్తంగా మారిందని, దోచుకుతినడం తప్ప ప్రజల బాగుగోలు పట్టించుకునే పరిస్థితిలో పాలకులు లేరని కాంగ్రెస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి ఆరోపించారు. మడికొండ రాజీవ్‌గృహకల్పలో నివాసముంటున్న బాలుడిపై వీధి కుక్కలు దాడిచేయగా ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈక్రమంలో ఎంజీఎం ఆస్పత్రిలో చిన్నారి ఆరోగ్య పరిస్థితులను నాయిని రాజేందర్ రెడ్డి ఆదివారం అడిగి తెలుసుకుని బాలుడి తల్లిదండ్రులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కాజీపేటలో బాలుడిపై కుక్కలు దాడి చేసి చంపేస్తే అధికారులు, ప్రజాప్రతినిధులు అప్పుడు నానా హడావుడి చేసి ఆర్థిక సహాయం చేసి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. ఘటన జరిగినప్పుడు మాత్రమే హడావుడి చేస్తూ ఆ తర్వాత మరిచిపోవడం షరా మాములుగా మారిందని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు పల్లకొండ సతీష్, బంక సంపత్, మహ్మద్ సమ్మద్, బొంత సారంగం, గన్నారపు సంగీత్, కొండ నాగరాజు, ఒరుగంటి పూర్ణ, శివ తదితరులు ఉన్నారు.

నేటి నుంచి రాజరాజేశ్వరీదేవి ఆలయంలో శాకంబరీ ఉత్సవాలు



హన్మకొండ కల్చరల్: వరంగల్ ఎంజీఎం ఎదురుగా ఉన్న రాజరాజేశ్వరీదేవి ఆలయంలో ఆషాఢ శుద్ధపాడ్యమి సోమవారం నుంచి శాకంబరి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. అందులో భాగంగా ఆదివారం అమావాస్య తిథిని అనుసరించి అమ్మవారి ఉపాసకులు ఎల్లంభట్ల లక్ష్మణశర్మ ఆధ్వర్యంలో మేడి వృక్షానికి పూజలు, రాజరాజేశ్వరీ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం నుంచి జూలై 3వ తేదీ వరకు జరగనున్న ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజు అర్చనలు జరుగుతాయని లక్ష్మణశర్మ తెలిపారు.